సాక్షి
గుంటూరు
శుక్రవారం : 20 : జూన్ : 2025



కిట్స్ సక్రమంగా అందించాలి

కొల్లిపర: విద్యార్థి మిత్ర కిట్స్‌ను సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్రీయ మాధ్యమిక సర్వశిక్ష అభియాన్‌డైరెక్టర్ పి.పార్వతి సూచించారు. ఆమె గురువారం స్థానిక జెడ్పీ హైస్కూలులో స్టాక్ పాయింట్‌ను తనిఖీ చేశారు.



ఆక్వాలో అధిక దిగుబడులకు కృషి

పొన్నూరు: ఆక్వా రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా మత్స్యశాఖ అధికారి భూక్యా సైదా తెలిపారు. ఆయన గురువారం నిడుబ్రోలులోని ఆక్వా ల్యాబ్‌ను పరిశీలించారు

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు

రెంటచింతల: పాలువాయి జంక్షన్ వద్ద నున్న షిర్డీ సాయి మందిరంలో ప్రధాన అర్చకుడు గోపాల్ పాండే ఆధ్వర్యంలో గురువారం భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజ లు నిర్వహించారు.



న్యూస్‌రీల్

సీఎం పర్యటన ఏర్పాట్లు పరిశీలన



తాడికొండ: సుపరిపాలన– స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల 23న వెలగపూడి రాష్ట్ర సచివాలయం సమీపంలో జరిగే కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు పాల్గొననున్న నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం సీఆర్డీఏ కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి కన్నబాబు, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల వివరాలు అడిగి తెలుసుకొని, అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ. భార్గవ తేజ, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ నవీన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసరావు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, డీటీ వసంతరావు పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు



లక్ష్మీపురం: రాష్ట్రంలోనూ, దేశంలోనూ మహిళలపై దాడులు, లైంగిక వేధింపులు పెరిగాయని, వయస్సుతో సంబంధం లేకుండా హత్యలు జరుగుతున్నాయని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి రెంటాల కుమారి ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు కొత్తపేటలోని జిల్లా సీపీఐ కార్యాలయంలోని మల్లయ్య లింగం భవన్‌లో రాజవరపు కోటేశ్వరమ్మ అధ్యక్షతన గురువారం మహిళా సమాఖ్య మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెంటాల కుమారి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం కఠినమైన చట్టాలు రూపొందించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో కొత్త నాయకత్వాన్ని ఎన్నుకున్నారు. గొట్టిముక్కల దుర్గ నగర అధ్యక్షురాలిగా, గుండెబోయిన లక్ష్మి ప్రధాన కార్యదర్శిగా, 11 మంది కార్యవర్గం, 21 సమితి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొన్నారు.

పామాయిల్ దిగుమతిపై సుంకాన్ని పెంచాలి



లక్ష్మీపురం: పామాయిల్ దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.వి.వి. ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉద్యాన శాఖ కమిషనర్ టి.శ్రీనివాస్‌ను రైతు సంఘం ప్రతినిధులు గురువారం కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగ్గించిన దిగుమతి సుంకాన్ని 40శాతం వరకు పెంచి దేశీయ ఆయిల్ పామ్ రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. కౌలు రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బకాయిలున్న అంతర పంటల సబ్సిడీ, ఫెర్టిలైజర్, ప్లాంట్ సబ్సిడీని తక్షణమే రైతులకు అందించాలని విన్నవించారు. పామాయిల్ రైతుల సంఘం కార్యదర్శి పుల్లూరి సోమశేఖరాచార్యులు, ఏలూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు రాయంకుల లక్ష్మణరావు, రైతు సంఘం నాయకులు చంగల వెంకటేశ్వరరావు, గుంటూరు జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి పి.వి. జగన్నాథం, పామాయిల్ రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకూ 'తల్లికి వందనం' ఇవ్వాలి



లక్ష్మీపురం: తల్లికి వందనం పథకాన్ని ఆప్కాస్‌లో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులందరికీ వర్తింపజేయాలని సీపీఐ నగర కార్యదర్శి, మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. గుంటూరు వసంతరాయపురం మలేరియా డివిజన్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కార్మికులు యూనియన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు మున్సిపల్ కార్మికులందరినీ లబ్ధిదారులుగా చేసి ఆదుకోవాలని కోరారు. ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, మున్సిపల్ కార్మికుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. డివిజన్లలో డంపర్ బాక్సులు పెంచి కార్మికులకు పని భారం తగ్గించాలని కోరారు.

తల్లులకు గుండెకోత

- ఆ చేత్తో ఇస్తూ...ఈ చేత్తో తీసేసుకుంటున్న ప్రభుత్వం
- 'తల్లికి వందనం' ఆర్థిక సాయాన్ని బకాయిల కింద జమ చేసుకుంటున్న బ్యాంకర్లు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు
- ఆర్థిక సాయం ప్రయోజనానికి విఘాతం

కూటమి సూపర్ సిక్స్ పథకాలు.. సాధారణ ఓటర్లను అమితంగా ఆకర్షించిన నినాదాలు ప్రజలను ఆశల పల్లకీ ఎక్కించాయి. కూటమి పార్టీలకు ఓట్లను కురిపించాయి. అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం, ఎన్నికల్లో ఇచ్చిన వరాలను కురిపిస్తుందని ఎదురుతెన్నులు చూశారు. ఊరించి, ఊరించి ఎట్టకేలకు 'తల్లికి వందనం' పథకం ఆర్థిక సాయాన్ని తల్లుల ఖాతాలకు జమ చేసింది ప్రభుత్వం. రకరకాల ఆంక్షలతో అర్హుల జాబితాలో పేర్లు ఎక్కని వారి సంగతి అటుంచి, ఖాతాలో జమ చేసిన డబ్బులకు రెక్కలొస్తున్నాయి. రుణ బకాయిలున్న తల్లుల ఖాతాల్లో పడిన 'తల్లికి వందనం' ఆర్థికసాయాన్ని బ్యాంకులు బకాయిలకు జమ చేసుకుంటున్నాయి. దీంతో తల్లులు గొల్లుమంటున్నారు.



తెనాలి: గతంలో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజల జీవన ప్రమాణాలను పెంచాలనే భావనతో అనేక సంక్షేమ పథకాలను ప్రకటించింది. వాటి అమలుకు క్యాలెండరును ప్రకటించింది. ఆయా తేదీల్లో లబ్ధిదారులకు ఠంఛన్‌గా ఆర్థిక సాయాన్ని నేరుగా వారి ఖాతాల్లో జమ చేసింది. అందులో అమ్మఒడి పథకం ఒకటి. పిల్లలు విద్యకు దూరం కాకుండా చూడాలనే ఉద్దేశంతో దీన్ని రూపొందించింది. బిడ్డలను బడికి పంపే తల్లికి ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ప్రకటించింది. రూ.13 వేల చొప్పున నాలుగేళ్లు ఆర్థికసాయాన్ని అందజేసింది. మిగిలిన రెండు వేల రూపాయలను పాఠశాలల అభివృద్ధి, టాయ్‌లెట్ల నిర్వహణకు కేటాయించింది.

ఆశలు అడియాస

'తల్లికి వందనం' పథకానికి అర్హులైన పలువురు తల్లుల పేర్లు అనర్హుల జాబితాలోకి ఎక్కాయి. అదేమని ప్రశ్నిస్తే, గ్రీవెన్స్‌లో పెట్టుకోమని అధికారులు చెబుతున్నారు. ఆ కార్యక్రమం జరుగుతోంది. ఈలోగా పలువురు లబ్ధిదారులకు తెలియకుండా వారి ఖాతాల్లో పడిన తల్లికి వందనం ఆర్థికసాయం ఖాళీ అవుతోంది. ఖాతాల్లోంచి డబ్బు మళ్లించిన మెసేజ్ రావటంతో పరుగు పరుగున బ్యాంకుకు వెళ్లిన లబ్ధిదారుల ఆశలు అడియాస అవుతున్నాయి. బకాయిలకు జమ చేసుకున్నామని బ్యాంకులు చెప్పిన మాటతో ఖిన్నులయ్యారు. టిడ్కో గృహాల రుణాల సహా వివిధ రుణాలకు సంబంధించిన బకాయిలున్న



ఖాతాదారుల్లో ఎవరికైనా తల్లికి వందనం ఆర్థికసాయం ఖాతాల్లో జమ కావడం ఆలస్యం, సంబంధిత బ్యాంకులు వాటిని బకాయిల్లో జమ చేసుకుంటున్నాయి. ఒక బ్యాంకు అని కాకుండా దాదాపు అన్ని ఇదే తరహాలో వసూలు చేస్తున్నట్టు తెలిసింది. కనీసం ఖాతాదారుకు సమాచారం లేకుండానే వారి ఖాతాల్లో పడిన డబ్బులను మళ్లించుకుంటున్నాయి. బిడ్డలను చదివించుకోవాలని అనుకుంటున్న తల్లుల ఆశయానికి విఘాతం కలుగుతోంది.

కూటమి నేతల సన్నాయి నొక్కులు

2024 ఎన్నికల్లో కూటమి పార్టీల నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ తదితరులు అమ్మఒడి సాయాన్ని తల్లికి వందనం పేరుతో ఇస్తామని ప్రకటించారు. ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అంతమందికి రూ.15 వేలు చొప్పున ఆ తల్లి ఖాతాలో జమచేస్తామని హామీనిచ్చారు. ఆయా పార్టీల కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లారు. ఇంట్లో చదువుతున్న పిల్లల పేర్లు రాసుకుని, వారికి అంత మొత్తం ఏటా వస్తుందని నమ్మబలికారు. వారిలో ఆశలు రేపారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చారు. గత ఏడాదిగా సూపర్ సిక్స్ పథకాల్లో సామాజిక పింఛన్లు మినహా మిగిలిన వాటిని పక్కన పెట్టేశారు. అదేమంటే గల్లా పెట్టె ఖాళీ అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతూ వచ్చారు. దీనిపై ప్రతిపక్ష నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలదీస్తుండటం, ప్రజల్లోనూ హామీలను అమలుచేయడం లేదన్న అసహనం పెరిగిపోతుండటంతో ప్రభుత్వం దిగి వచ్చింది. విద్యాసంవత్సరం ఆరంభంలో తల్లికి వందనం ఆర్థికసాయాన్ని రూ.13 వేల చొప్పున ప్రభుత్వం తల్లుల జాబితాల్లో వేసింది.

రాజధానిలో మొక్కలకు డ్రోన్లతో వర్మీవాష్



తాడికొండ: రాజధాని అమరావతిలో పచ్చదనం పెంపొందించేందుకు, మొక్కలకు పోషకాలు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) అధికారులు తెలిపారు. ప్రధాన అనుసంధాన రహదారి సీడ్ యాక్సిస్ రోడ్డుపై 10 కిలోమీటర్ల మేర పూల మొక్కలకు డ్రోన్ల ద్వారా వర్మీవాష్ చేసే ప్రక్రియను గురువారం ప్రారంభించారు. ఆర్గానిక్ పోషకాలను మొక్కలకు అందించడానికి ఈ పద్ధతి తోడ్పడుతుందని చెప్పారు. ప్రధానంగా ఈ పద్ధతిలో డ్రోన్‌ల ద్వారా జరిగే ప్రక్రియలో మొక్క పైనుంచి కింది భాగం వరకు పోషకాలు అందించవచ్చని తెలిపారు. దీని ద్వారా పూలు అందంగా పూయడంతో పాటు రహదారులు ఆకర్షణీయంగా ఉంటాయని చెప్పారు.

22న అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : జిల్లా క్రికెట్ అసోసియేషన్ త్రిసభ్య కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉదయం 8 గంటలకు స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకలగుంట క్రీడా మైదానంలో జిల్లాస్థాయి అండర్-16 బాలుర క్రికెట్ జట్టు ఎంపిక నిర్వహిస్తామని సభ్యులు వి.మనోజ్ సాయి, యు.మహతీ శంకర్, బి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1-2009 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. సెలక్షన్స్‌కి వచ్చేటప్పుడు వైట్ డ్రెస్‌తోపాటు సొంత కిట్, వయస్సు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని ఆయన సూచించారు.

రాజధాని నిర్మాణం
అంతా అగమ్యగోచరం



సమావేశంలో పాల్గొన్న నేతలతో వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పార్లమెంటు పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పార్లమెంటు పరిశీలకులు మోదుగుల

గుంటూరు రూరల్: రాజధాని నిర్మాణం అంతా అగమ్యగోచరంగా ఉందని గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల పార్లమెంటు పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి అన్నారు. రాజధాని ప్రాంతానికి చెందిన వైఎస్సార్ సీపీ సమన్వయకర్తలు, ముఖ్య నేతల సమావేశాన్ని గురువారం రెడ్డిపాలెంలోని స్వగృహంలో నిర్వహించారు. మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ రాజధానిలో నిర్మాణాలు ఎప్పుడు పూర్తి చేస్తారు? భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం ఎప్పటిలోగా అందజేస్తారని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జగనన్న కాలనీలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిన పరిస్థితులు ఉన్నాయని, వాటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన పేదలకు తిరిగి భూములు ఇస్తారా? ఇస్తే ఎక్కడ ఇస్తారు? అని ఆయన ప్రశ్నించారు. సీఆర్డీఏ, ఎంఏయూడీ అఖిలపక్షాన్ని పిలిచి, రాజధాని ప్రాంతంలో పరిస్థితులు, జరుగుతున్న పనులను వివరించాలని డిమాడ్ చేశారు. సీఆర్డీఏ తీసుకున్న రుణాలపై శ్వేతపత్రం వెంటనే విడుదల చేయాలని కోరారు. రైతులకు కౌలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. సీఆర్‌డీఏ పరిధిలోని జగనన్న కాలనీలను రద్దు చేశారు కాబట్టి వారికి వేరే ప్రాంతంలో భూములు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, మంగళగిరి ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి, మండపాటి శేషగిరిరావు, దంటు బాలాజీరెడ్డి పాల్గొన్నారు.

అప్పుడు తప్పు.. ఇప్పుడు ఒప్పు !

- 2013-14 లో ఆస్తి పన్ను తగ్గింపులో అవకతవకలకు పాల్పడిన అధికారులు
- ప్రజల నుంచి ఫిర్యాదుల వెల్లువ
- 2018లో 12 మంది అధికారులపై ఆర్టికల్ చార్జెస్‌ను ఫ్రేమ్ చేస్తూ ఉత్తర్వులు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వారిపై చర్యలు తీసుకోవాలని 2021లో ఆర్‌డీఎంఏను ఆదేశించిన ప్రిన్సిపల్ సెక్రటరీ
- విచారణ ఫైల్‌ను ప్రభుత్వానికి పంపని అప్పటి ఆర్‌డీఎంఏ అధికారులు
- తాజాగా ఉద్యోగులపై ఆర్టికల్ చార్జెస్‌ను తొలగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు



గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ అధికారులు తప్పులెన్ని చేసినా తప్పించుకునే మార్గాలను వెతుకుతూనే ఉంటారు. ఉన్నతాధికారులను మ్యానేజ్ చేసుకోవడంలో సిద్ధహస్తులనే చెప్పుకోవాలి. దీనికి 2013-14లో జరిగిన ఆస్తి పన్ను తగ్గింపు వ్యవహారం అద్దం పడుతోంది. భారీగా అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదుపై అప్పటి ఆర్‌డీఎంఏ చల్లా అనురాధ విచారణ చేపట్టారు. ఆమె వాస్తమేనని తేల్చి రిపోర్టు ఇచ్చారు. దాని ఆధారంగా బాధ్యులైన అధికారులపై ఆర్టికల్ చార్జెస్ ఫ్రేమ్ చేశారు. ఇప్పుడు వారంతా తప్పేమి చేయలేదంటూ వాటిని తొలగిస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నగరపాలక సంస్థ ఖజానాకు భారీ నష్టం

2013-14లో ఆస్తి పన్నులను (రివిజన్ పిటిషన్) భారీగా తగ్గించారు. దీని వల్ల నగరపాలక సంస్థ ఖజానాకు కోట్ల రూపాయిల్లో నష్టం వాటిల్లింది. దీనిపై ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు అందడంతో అప్పటి మున్సిపల్ ఆర్డీగా ఉన్న చల్లా అనురాధ పన్నులు తగ్గింపు విషయం వాస్తవమేనని తేల్చారు. దీనివల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని నివేదిక ఇచ్చారు. దీనిపై టీడీపీ ప్రభుత్వం 2018లో అవినీతి అధికారులపై చార్జ్‌స్ ఫ్రేమ్ చేసి వదిలేసింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని భావించింది. దీనికి సంబంధించి పూర్తి వివరాలతో మూడు నెలల్లో రిపోర్టు ఇవ్వాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై. శ్రీలక్ష్మి 2021 జూలై 8న ఆదేశాలు జారీ చేశారు. 2021 సెప్టెంబర్‌లో మున్సిపల్ ఆర్డీ అక్రమాలకు పాల్పడిన అధికారులకు విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. విచారణ చేసి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఆ ఫైల్‌ను ప్రభుత్వానికి పంపించడంలో అప్పటి ఆర్డీ శ్రీనివాసరావు, కార్యాలయ సిబ్బంది మీనమేషాలు లెక్కించడంతో పెండింగ్‌లో పడిపోయింది. తాజాగా ఈ నెల 16న సదరు అధికారులు ఎటువంటి తప్పు చేయలేదని, వారిపై ఆర్టికల్ చార్జెస్‌ను తీసివేస్తున్నట్లు ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

కూటమి ప్రభుత్వ కనికరం

ఆర్టికల్ చార్జెస్ ఉంటే రిటైర్‌మెంట్ అయిన తరువాత బెనిఫిట్స్ అందవు. ప్రస్తుతం చాలా మంది ఉద్యోగులు రిటైర్‌మెంట్ స్టేజ్‌కు దగ్గరలో ఉన్నారు. చార్జెస్ ఫ్రేమ్ చేసింది టీడీపీ ప్రభుత్వ హయాంలోనే కాబట్టి వీరంతా పావులు కదిపారు. తమ పలుకుబడి ఉపయోగించి ఆర్టికల్ చార్జెస్ తీయించుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అవకతకవలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి వారిని తప్పిస్తే మిగతా ఉద్యోగులు ప్రభుత్వాన్ని ఏ విధంగా లెక్క చేస్తారంటూ కొంతమంది ఉద్యోగులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.


అప్పటి అధికారుల జాబితాలో ప్రస్తుత కమిషనర్

రివిజన్ పిటిషన్‌లో అక్రమాలకు పాల్పడిన జాబితాలో ప్రస్తుత నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు కూడా ఉన్నారు. ఆ సమయంలో ఆయన అదనపు కమిషనర్‌తో పాటు ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పని చేశారు. ఆయనతో పాటు వి.సత్యప్రసాద్ ఆర్వో(రిటైర్డ్), ఎల్. పద్మ (ఆర్ఐ), ఎస్. నారాయణరావు(ఆర్ఐ రిటైర్డ్), ఎస్.వి.వి.ఎస్. మదన్‌గోపాల్(ఆర్ఐ), డి. మాధవి, ఎ.నిమిద కోటయ్య, పి. వెంకట్రావు (డీలింగ్ అసిస్టెంట్), డి. నాగరాజు(బిల్ కలెక్టర్), ఎస్‌కే నసీర్ అహ్మద్(బిల్ కలెక్టర్), ఎండీ ఉస్మాన్‌అలీ(బిల్ కలెక్టర్), జె. శ్యాంప్రసాద్ (బిల్ కలెక్టర్) ఉన్నారు.

నేటి నుంచి బర్లీ పొగాకు కొనుగోలు

మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి

నరసరావుపేట: జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి యడ్లపాడులోని స్టేట్ వేర్‌హౌస్ కార్పొరేషన్ గోడౌన్‌లో హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తామని ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ అతిథి గృహంలో అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా హెచ్‌డీఎం టాప్ గ్రేడ్ టొబాకో కిలో రూ.120, హెచ్‌డీఎక్స్ గ్రేట్ టొబాకో కిలో రూ.60లకు కొనుగోలు చేస్తామన్నారు. రైతులు పొగాకును గ్రేడ్లుగా చేసుకొని బేళ్లుగా కట్టుకొని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. తేమశాతం 20 శాతానికి మించకూడదన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు కొనుగోలు తేదీ, సమయం వారి మొబైల్ నెంబర్‌కి సమాచారం వస్తుందని, ఆరోజు మాత్రమే కొనుగోలు కేంద్రానికి పొగాకు తీసుకురావాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ పొగాకు సాగుచేసిన రైతులు సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లయితే వారు పండించిన పొగాకును ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. జిల్లాలో 2522 మంది రైతులు ఏపీఏఎంఐఎస్ యాప్‌లో పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. ఆర్డీఓ కె.మధులత, ఎం.శివకుమారి, ఏడీఏ పి.మస్తానమ్మ, కొనుగోలు అధికారి మురళి పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న నరసింహారెడ్డి

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన అవసరం

సాంఘిక, గిరిజన సంక్షేమం శాఖ కార్యదర్శి మల్లికార్జుననాయక్

మంగళగిరి: సికిల్ సెల్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ సాంఘిక, గిరిజన సంక్షేమం శాఖ కార్యదర్శి ఎం.మల్లికార్జున నాయక్ తెలిపారు. ప్రపంచ సికిల్ సెల్ దినోత్సవం సందర్భంగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్)లో గురువారం ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఆరోగ్య కార్యకర్తలు, గిరిజన వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జుననాయక్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో సికిల్ సెల్ వ్యాధిని నిర్మూలించేందుకు ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. వారసత్వంగా వచ్చే రుగ్మతకు వ్యతిరేకంగా పోరాటం చేయడంలో భాగంగా ప్రజల్లో అవగాహన పెంచాలని ఆయన సూచించారు.

కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అదనపు డైరెక్టర్ సరస్వతి, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రసన్న, బ్లడ్ సెల్ కన్సల్టెంట్ డాక్టర్ సోనియా మోహన్, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, ఎయిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్ శ్రీమంత్‌కుమార్ దాస్, ఎయిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.



ర్యాలీ పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,000** గరిష్ఠం : రూ. **1,500**

మోడల్ ధర రూ. **1,300**

మిర్చి యార్డు సమాచారం
(గురువారం ధరలు)



వచ్చిన బస్తాలు	41,600
అమ్మకాలు	43,494
నిల్వ	8,856

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500–13,000
నంబరు–5	10,000–13,200
273	10,000–12,400
341	10,000–13,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,800–13,300
నంబరు–5	10,000–13,300
341	10,000–13,500
273	10,000–13,400

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,000
బాడిగ–355	10,000 – 13,000
దేవనూరు డీలక్స్	10,000 – 13,000
ఆర్మూర్	9,800 – 11,300
తాలుకాయలు	5,000–6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,200
బాడిగ–355	10,000 – 13,300
దేవనూరు డీలక్స్	10,000 – 13,500
తాలు	5,000 – 7,000

–కొరిటెపాడు (గుంటూరు)

సంక్షేమం అమలుపై లెక్కలు చెప్పండి !

- మాజీ ఎమ్మెల్యే శివకుమార్ డిమాండ్
- తొలి ఏడాది రూ.187.08 కోట్ల సంక్షేమ పథకాల అమలు
- కూటమి ప్రభుత్వంలో ఈ ఏడాది ఎంత ఇచ్చారు ?
- మంత్రి మనోహర్ గణాంకాలు వెల్లడించాలి

తెనాలి: నియోజకవర్గంలో గత ఏడాది ప్రజలకు అందించిన సంక్షేమాన్ని ప్రకటించాలని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ డిమాండ్ చేశారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేగా తాను 2019–2020లో నియోజకవర్గంలో రూ.187,08,10,000 సంక్షేమాన్ని అందించానని లెక్కలు చెప్పారు. కనీసం అమలుచేసిన పథకాల సాయం గణాంకాలనైనా వివరించాలని ఆయన మంత్రి మనోహర్‌ను కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తొలి ఏడాది పాలన 2019–2020, కూటమి ప్రభుత్వం ఏడాది కాలం 2024–2025 పాలనను బేరీజు వేస్తూ రూపొందించిన 'జగన్ అంటే నమ్మకం... చంద్రబాబు అంటే మోసం' పుస్తకాన్ని గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్ ఆవిష్కరించారు. అక్కడే విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను మరచి, వ్యవస్థలు, వ్యక్తులు, వైఎస్సార్ సీపీ నేతలపైనా పాల్పడుతున్న ఆరాచకాలను తాజా పుస్తకం బహిర్గతం చేస్తుందని తెలిపారు. పేదవాడి సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రథమ ప్రాధాన్యతను ఇచ్చిందని చెప్పారు. 2024–25లో నియోజకవర్గంలో అందించిన సంక్షేమాన్ని మనోహర్ వెల్లడించాలని స్పష్టంచేశారు. వంట గ్యాస్ సిలెండర్ల పథకానికి ఎందరు అర్హులు? ఎంతమందికి ఇచ్చారు? ఎందరికి డబ్బులు ఖాతాల్లో వేశారనే వివరాలను ఇంతకుముందు తాను కోరినా ఇప్పటికీ సమాధానం ఇవ్వలేదని శివకుమార్ గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ, రూరల్, కొల్లిపర మండల అధ్యక్షులు దేసు శ్రీనివాసరావు, చెన్నుబోయిన శ్రీనివాసరావు, కల్లం వెంకటప్పారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గోల్డ్ రహిమా, కౌన్సిలర్లు షేక్ దుబాయ్‌బాబు, యాతాటి అనిల్, మల్లెబోయిన రాము, బూరెల దుర్గాప్రసాద్, చింకా సురేష్‌యాదవ్, కాకి దేవసహాయం, దేవరపల్లి భూషణం, బండ్లమూడి నాని, ధరణికోట మల్లికార్జునరావు, అక్కిదాసు కిరణ్‌కుమార్, షేక్ మీరావలి, ఇందిరా ప్రియదర్శిని, నాలాది బుజ్జిబాబు, కార్తికేయ, కె.భవానీశంకర్ పాల్గొన్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరించిన శివకుమార్, పార్టీ నేతలు

డిగ్రీ పట్టా వెనుక తల్లిదండ్రుల త్యాగం

- ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి
- ఘనంగా వీవీఐటీ స్నాతకోత్సవం

పెదకాకాని: ప్రతి ఒక్క విద్యార్థి డిగ్రీ పట్టా వెనుక తల్లిదండ్రుల త్యాగాలు ఎన్నో ఉంటాయని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల స్నాతకోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. మధుమూర్తి, వీవీఐటీ విశ్వవిద్యాలయ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు. ప్రొఫెసర్ మధుమూర్తి మాట్లాడుతూ డిగ్రీ అంటే కేవలం పట్టా మాత్రమే కాదు జ్ఞానాన్ని సంపాదించడం అన్నారు. స్టార్టప్ కంపెనీలను స్థాపించి ఉద్యోగాలు అందించే స్థాయికి విద్యార్థులు ఎదగాలని సూచించారు. వీవీఐటీ విశ్వవిద్యాలయ చాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను అధిగమించి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వైస్ చాన్సలర్ కొడాలి రాంబాబు మాట్లాడుతూ 2007లో ప్రారంభమైన వీవీఐటీ కళాశాల అనతి కాలంలోనే అనేక విజయాలను సొంతం చేసుకొని 2025లో విశ్వవిద్యాలయంగా ఎదిగిందని చెప్పారు. వీవీఐటీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జునరెడ్డి కళాశాల వార్షిక ప్రణాళికను, భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. 2021–2025 విద్యా సంవత్సరానికి గాను అత్యుత్తమ ప్రతిభ కనబరచి కళాశాల టాపర్‌గా నిలచిన విద్యార్థిని పరుచూరి బిందు రేణుకకు వాసిరెడ్డి వెంకటాద్రి బంగారు పతకాన్ని ముఖ్య అతిథి ప్రొఫెసర్ కె. మధుమూర్తి అందజేశారు. క్లాస్ ఆఫ్ 2025కు ఉత్తమ ప్రతిభ కనబరచిన 11 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలతోపాటు 1195 మంది పట్టభద్రులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేలా విద్యార్థులు వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో వీవీఐటీ వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, సెక్రటరీ ఎస్. బదరీప్రసాద్, జాయింట్ సెక్రటరీ మామాళ్లపల్లి శ్రీకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె. గిరిబాబు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


కళాశాల టాపర్ బిందురేణుకకు బంగారు పతకం అందజేస్తున్న మధుమూర్తి



పసుపు ధరలు
(గురువారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : **142**

కొమ్ములు : 90 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
8,000	10,550	10,505

కాయలు : 52 బస్తాలు

కనిష్ఠ :	గరిష్ఠ :	మోడల్ :
10,430	10,550	10,505

మొత్తం అమ్మకాలు : **106.500** క్వింటాళ్లు

–దుగ్గిరాల

రాష్ట్ర అథ్లెటిక్ పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు

గుంటూరు వెస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన ఏపీ స్టేట్ సీనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ఐదు బంగారు, ఐదు రజత, నాలుగు కాంస్య కలిపి మొత్తం 14 పతకాలు సాధించారని అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులను అసోసియేషన్ చైర్మన్ జి.శేషయ్య, ఏఐసీసీ కార్యదర్శి జి.ఉషారాణి అభినందించారని ఆయన పేర్కొన్నారు.

బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు
షేక్ మొహిద్దీన్ (హైజంప్), బి.మణికంఠ (హేమర్ త్రో), కె.రేష్మి (జావలిన్ త్రో), అంకమ్మ (ఐదు కిలో రేస్, 800 మీటర్ల రేస్), ఏ.వి.జి.కృష్ణంనాయుడు (జావలిన్ త్రో)

సిల్వర్ పతకాలు సాధించిన క్రీడాకారులు
రవికిరణ్ (110 మీటర్ల హర్డిల్స్), శంకర్ (డెకత్‌లాన్), వైష్ణవి (షార్ట్‌పుట్), ప్రసన్న (100 మీటర్ల హర్డిల్స్), ప్రవీణ్‌కుమార్ (400 మీటర్ల పరుగు), శంకర్ (400 మీటర్ల పరుగు) కాంస్యం సాధించారు.

పథకం ప్రకారమే వృద్ధురాళ్ల హత్య

- మృతుల్లో ఒకరైన రాజేశ్వరికి పరిచయమున్న మహిళ కీలకం
- పోలీసుల దర్యాప్తులో వెల్లడి
- రక్షించుకునేందుకు ప్రయత్నించి ప్రాణాలు కోల్పోయిన వృద్ధురాళ్లు

తెనాలి రూరల్: స్థానికంగా కలకలం రేపిన వియ్యపురాళ్ల హత్యలు పథకం ప్రకారమే జరిగినట్టు తెలుస్తోంది. ఇద్దరూ వృద్ధ మహిళలు ఒంటరిగా ఉంటున్నారని గమనించిన దుండగులు వారిని హతమార్చి బంగారాన్ని అపహరించారు. ముందుగానే వేసుకున్న పథకం ప్రకారమే హత్య చేసినట్టు ఘటన స్థలంలో తెలుస్తోంది. ఆటోలో గురువారం ఉదయం 11.30 గంటల సమయంలో ఓ మహిళ, ఇద్దరు యువకులు వియ్యపురాళ్లైన దాసరి రాజేశ్వరి(65), పిటా అంజమ్మ(70)లు ఒంటరిగా ఉంటున్న నివాసానికి రావడం సీసీ కెమెరాల్లో రికార్డు అయింది. వచ్చి 10 నిమిషాల అనంతరం వెళ్లపోయారని స్థానికులు చెబుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు వచ్చిన సందర్భంలో కేకలు వినపడ్డాయని, కొందరు పోలీసులకు తెలిపారు. తెనాలి నుంచి బాపట్ల జిల్లా చుండూరు మండలం చినపరిమి గ్రామానికి వెళ్లే రోడ్డులో గతంలో నిర్వహించిన అప్పడాల కంపెనీ పై అంతస్తులో వృద్ధ వితంతు వియ్యపురాళ్లు కలసి ఉంటున్నారు. సాధారణంగా వీరు కింది కంపెనీలోకి వెళ్లరని, సాయంత్రం ఇంటి బయట అరుగు మీద కూర్చుంటూ ఉంటారని స్థానికులు చెబుతున్నారు. హత్యలు మాత్రం వాడుకలో లేని అప్పడాల కంపెనీలో జరగడం గమనార్హం. రెండు మృతదేహాలు వేర్వేరు గదుల్లో పడి ఉన్నాయి.

తెలిసిన వ్యక్తుల పనే?

ఈ డబుల్ మర్డర్ తెలిసిన వ్యక్తుల పనే అయి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. సీసీ పుటేజీలో రికార్డు అయిన మహిళకు, రాజేశ్వరికి కొన్నేళ్లుగా పరిచయముందని ఇక్కడి వారు చెబుతున్నారు. ఆ పరిచయం ఆధారం చేసుకుని అప్పడాల కంపెనీని అద్దెకు తీసుకునేందుకు వచ్చి, రాజేశ్వరి, అంజమ్మలను కిందకు పిలిపించి కంపెనీలోకి తీసుకెళ్లి హత్య చేసినట్టు భావిస్తున్నారు.

హత్య సందర్భంలో తీవ్ర పెనుగులాట?

నిందితులు వృద్ధురాళ్లను హత్య చేసేందుకు ప్రయత్నించిన సమయంలో ఇద్దరూ తీవ్రంగానే ప్రతిఘటించడంతో పెనుగులాట జరిగినట్టు తెలుస్తోంది. ఘటనా స్థలంలో మృతదేహాలు పడి ఉన్న తీరు ఇందుకు బలం చేకూరుస్తోంది. రాజేశ్వరి చేతిలో కర్ర ఉండగా, అంజమ్మ చేతిలో రెండు కిలోల తూకం రాయి రక్తం మరకలతో ఉంది. దీనిని బట్టి పెనుగులాట జరిగి ఉంటుందని, ఇద్దరూ తమను రక్షించుకునే ప్రయత్నం చేయడంతో దుండగులు విచక్షణారహితంగా తలలపై దాడి చేసి హత్యకు పాల్పడినట్టు తెలుస్తోంది. తమ వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్లు, ఇతర పరికరాలతో దాడి చేసి హత్య చేసి ఉంటారని ఘటనాస్థలాన్ని పరిశీలించిన పోలీసులు, క్లూస్ టీం భావిస్తున్నారు. అంజమ్మ చేతిలోని తూకం రాయి, రాజేశ్వరి చేతిలోని కర్రను క్లూస్ టీం సీజ్ చేసింది. ఇద్దరి మృతదేహాలు వేర్వేరు గదులోల పడి ఉన్నాయి. హత్య చేసి వీరి వద్ద ఉన్న బంగారాన్ని నిందితులు అపహరించుకెళ్లినట్టు పోలీసులు చెబుతున్నారు. ప్రస్తుతం నిందితుల ఆచూకీ పోలీసులు గుర్తించి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది.


అంజమ్మ చేతిలో ఉన్న తూకం రాయి


రాజేశ్వరి చేతిలో ఉన్న కర్ర



సింగయ్య కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండ


నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఇన్‌చార్జి బలసాని కిరణ్‌కుమార్ తదితరులు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వెంగళాయపాలెం గ్రామానికి చెందిన చీలి సింగయ్య (53) కుటుంబానికి వైఎస్సార్ సీపీ నేతలు గురువారం ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నియోజకవర్గం ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి కొలకలూరి కోటేశ్వరరావు తదితరులు సింగయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబానికి వైఎస్సార్ సీపీ కుటుంబం ప్రతి విషయంలో తోడుంటుందని తెలిపారు. పార్టీ తరఫున ఇప్పటికే రూ. 10 లక్షలను ప్రకటించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లాలాపేట పీఎస్ పరిధిలో అనుమానితుడు పరారీ

పట్నంబజారు: గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం చోరీ కేసులో అనుమానితుడిగా ఉన్న ఓ యువకుడు పరారైనట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. లాలాపేట పోలీసు స్టేషన్‌పరిధిలోని పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న నిమ్మలపేటకు చెందిన ఓ యువకుడిని కొద్ది రోజుల కిందట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం సాయంత్రం క్రైం విభాగ రూంలో ఉన్న యువకుడు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించిన క్రమంలో స్టేషన్ నుంచి బయటకు పరుగెత్తినట్లు సమాచారం. తేరుకున్న పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ అతని జాడ తెలియరాలేదు.

హైవేపై మూడు వాహనాలు ఢీ

మార్టూరు: జాతీయ రహదారిపై ఒకదాని వెనుక మరొకటిగా వెళుతున్న మూడు వాహనాలు పరస్పరం ఢీకొన్న సంఘటన స్థానిక రాజుపాలెం, డేగరమూడి రెస్ట్ ఏరియా సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది నాయక్, శ్రీహరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలుకు చెందిన పద్మనాభయ్య శెట్టి తన వాహనంలో చిలకలూరిపేట నుంచి ఒంగోలు వెళ్తున్నాడు. రెస్ట్ ఏరియా సమీపంలోకి వెళ్లగానే వాహనాన్ని వెనుక నుంచి గ్రావెల్ తరలించే టిప్పర్ వాహన డ్రైవర్ బలంగా ఢీ కొట్టి రహదారి మధ్యలో తన వాహనాన్ని నిలిపివేశాడు. అదే మార్గంలో విజయవాడ నుంచి కృష్ణపట్నం పోర్టుకు వెళుతున్న కంటైనర్ వాహనం హఠాత్తుగా అడ్డుగా వచ్చిన టిప్పర్ వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ప్రమాద తీవ్రతకు మూడు వాహనాలు ధ్వంసం అయినప్పటికీ వాటిల్లోని వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్, ట్రాఫిక్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకొని, రహదారికి అడ్డంగా ఉన్న వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూశారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ వాహనాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు.


ప్రమాదంలో ధ్వంసమైన వాహనాలు

రెండు కుటుంబాల మధ్య ఘర్షణ

చిలకలూరిపేట టౌన్: ఆర్థిక పరమైన వివాదాన్ని మనసులో పెట్టుకుని రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో మహిళకు గాయాలయ్యాయి. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన ఆవుల దేవరాజు, శ్రీదేవి దంపతులు, అదే గ్రామానికి చెందిన ఎం.నాగరాజు, గోవిందమ్మ దంపతులు గురువారం గ్రామంలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పెదకర్మ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ క్రమంలో రెండు కుటుంబ సభ్యుల మధ్య జరిగిన వాగ్వాదం కాస్తా ఘర్షణకు దారితీసింది. ఈ మేరకు జరిగిన దాడిలో శ్రీదేవికి గాయాలయ్యాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నర్సింగ్ బదిలీల కౌన్సెలింగ్‌పై అభ్యంతరాలు

50 మందికి పైగా ఫిర్యాదులు

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో (ఆర్డీ) బుధవారం రాత్రి అర్ధరాత్రి వరకు జరిగిన స్టాఫ్ నర్సు, హెడ్ నర్సుల బదిలీల కౌన్సెలింగ్‌పై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు చెందిన 50 మందికి పైగా ఫిర్యా దులను ఆర్డీకి అందజేశారు. కౌన్సెలింగ్ నిబంధనల ప్రకారం తమకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని కోరారు. జూమ్ కౌన్సెలింగ్‌లో ఇబ్బందికర పరిస్థితుల గురించి వివరించారు. తమకు న్యాయం చేయాలని బదిలీ కౌన్సెలింగ్ ప్రత్యేక అధికారికి సైతం వినతి పత్రం అందజేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు వేచి ఉండి అభ్యంతరాలను తెలియజేశారు.

ముగిసిన కౌన్సెలింగ్

ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో పనిచేస్తున్న వైద్య సిబ్బందికి నాలుగు రోజులుగా జరుగుతున్న బదిలీ కౌన్సెలింగ్ గురువారంతో ముగిసింది. చివరి రోజు ఆఫీస్ సూపరింటెండెంట్లు, సీనియర్ అసిస్టెంట్లు, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఫార్మాసిస్టులు, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్లకు కౌన్సెలింగ్ జరిగింది.

న్యూక్లియర్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా డాక్టర్ శంకర మహదేవ్

గుంటూరు మెడికల్: జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్‌లో న్యూక్లియర్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా డాక్టర్ డి.శంకర మహదేవ్‌ను నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డి.ఎస్.వి.ఎల్.నర్సింహం గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాది పాటు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు గానూ నెలకు రూ. 2 లక్షలు వేతనం చెల్లించేందుకు డీఎంఈ ఉత్తర్వులు ఇచ్చారు. గతంలో డాక్టర్ శంకర మహదేవ్ జీజీహెచ్‌లో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు.

నగదు అపహరణ

అద్దంకి: బ్యాంకు ఖాతా నుంచి నగదు విత్‌డ్రా చేసి తీసుకెళ్తున్న వ్యక్తి నుంచి గుర్తు తెలియని యువకులు నగదు కాజేసిన ఘటన పట్టణంలోని గురువారం చోటుచేసుకుంది. మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి రూ.2.5 లక్షలను విత్‌డ్రా చేసి బైక్ ట్యాంకు బ్యాగ్‌లో పెట్టుకుని తీసుకెళుతున్నాడు. మార్గంమధ్యలో టీ తాగడానికి ఆగాడు. బండిపై నుంచి వెంకటరామిరెడ్డి దిగగానే ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు నగదు తీసుకుని ఉడాయించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసలై...

- ఉరి వేసుకుని ఒకరు ఆత్మహత్య
- అపస్మారకస్థితికి చేరి కార్పెంటర్ మృతి

పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్ఆర్‌కాలనీ గాంధీనగర్ 3వ లైనులో నడికట్టు శివశంకర్‌రెడ్డి (24) మద్యానికి బానిసగా మారాడు. ఎలాంటి పనులు చేయకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. గురువారం ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతికి సంబంధించి కారణాలు తెలియరాలేదు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- **లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్) :** మద్యం తాగి వ్యక్తి మృతి చెందిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు గురువారం రాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరులోని శారదా కాలనీకి చెందిన జ్యోతి, అదే ప్రాంతానికి చెందిన కర్నాటి గోపి(36) 15 సంవత్సరాల కిందట ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఆడ, మగ సంతానం ఉన్నారు. గోపి కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. ఇటీవల మద్యానికి పూర్తిగా బానిసగా మారాడు. గురువారం ఉదయం భార్య పిల్లలను స్కూల్‌కు తీసుకువెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి గోపి తాగి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. దీంతో జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జ్యోతి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

రెండు కుటుంబాల అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని ప్రకాష్‌నగర్‌లో నివసించే రెండు కుటుంబాలకు చెందిన ఆరుగురు కనిపించడం లేదంటూ ఓ వ్యక్తి గురువారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. కారు డ్రైవింగ్‌కు వెళ్లిన బెవర దుర్గారావు ఇంట్లో ఉన్న భార్యకు ఫోన్ చేశాడు. ఆమె గానీ కుటుంబ సభ్యులు గానీ లిఫ్ట్ చేయలేదు. ఇంటికి వచ్చి చూడగా వారు కనిపించలేదు. తన భార్యతో పాటు తోడల్లుడి కుటుంబం కూడా కనిపించడం లేదని పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశాడు. కనిపించకుండా పోయిన వారిలో దుర్గారావు భార్య సుధారాణి, కుమారుడు నవీన్ కుమార్, కుమార్తె యశ్వణి, తోటికోడలు, మరో ఇద్దరు ఉన్నారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తాడేపల్లి ఎస్ఐ ప్రతాప్ కుమార్ కేసు నమోదు చేశారు.


కనిపించకుండా పోయిన తోడికోడళ్లు

లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు


ఒకరు మృతి.. ఐదుగురికి స్వల్ప గాయాలు

సంతమాగులూరు(అద్దంకి): నిలిచి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా, ఐదుగురికి గాయాలైన సంఘటన సంతమాగులూరు మండలంలోని పాతమాగులూరు గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. అందిన సమాచారం మేరకు.. తణుకు నుంచి నంద్యాల వైపు లోడ్‌తో వెళుతున్న లారీ పాత మాగులూరు వద్ద ఆగి ఉంది. ఈ క్రమంలో విజయవాడ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందున్న లారీని గమనించకుండా ఢీ కొట్టడంతో మూడో సీటులో కూర్చున్న అనంతపురం రూరల్ మండలానికి చెందిన హుస్సేన్(55) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఐదుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి.

రైలులో బెర్త్ లేక బస్సులో..

దూదేకుల హుస్సేన్ ఈ నెల 17న స్నేహితుడు అబ్దుల్ దౌలాతో పనిమీద విజయవాడ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఇద్దరూ రైలు ఎక్కడానికి మచిలీపట్నం రైల్వేస్టేషన్‌కు వెళ్లారు. అక్కడ ఒకే బెర్త్ ఉండటంతో, దౌలా రైలు ఎక్కాడు. హుస్సేన్ బస్సులో అనంతరపురం బయలుదేరాడు. సంతమాగులూరు మండలం పాత మాగులూరు గ్రామ సమీపంలోకి రాగానే ముందు ఆగి ఉన్న లారీని ఢీ కొట్టడంతో సీటులో కూర్చుని ఉన్న హుస్సేన్ తల ముందు సీటుకు తగిలి, తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ఆశాబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి శవ పంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు.


లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు


హుస్సేన్‌మృతదేహం

ఫ్యాషన్



గాజులది ఆభరణాలను మించిన స్థాయి.
సంప్రదాయం, వేడుక ఏదైనా మణికట్టు చుట్టూ మెరిసే వ్యక్తిగత శైలి.
వివాహిత మహిళలకు గాజులలో శ్రేయస్సు, ప్రేమ మెండుగా కలిసి ఉంటాయి.
అందుకే, పాత మట్టి గాజులైనా వాటి స్థానాన్ని వీడి పోవు.
ఆధునిక మహిళ ఆ గాజులను కొత్త అల్లికలు, రంగులు, శైలులతో మణికట్టును కనికట్టు చేస్తోంది.
వేడుకల కోసం రకరకాల ఆభరణాలతో వార్డ్‌రోబ్‌ను కొంగొత్తగా నిర్మిస్తున్నా
రాబోయే పండుగ రోజుల్లో చేతుల లుక్‌ను పెంచుకోవాలనుకునే వారికి
సేకరణలో పూర్తిగా చోటు సంపాదించడానికి కావల్సినన్ని జతల గాజులు దొంతర్లుగా సిద్ధంగా ఉన్నాయి.
వాటిలో ట్రెండ్‌లో ఉన్న ముఖ్యమైన ఐదు రకాలు
గాజుల పెట్టెలో తప్పక ఉండాల్సిందే!

మణికట్టు... కనికట్టు



ప్రతిరోజు గ్లామర్ ...
మినిమలిస్ట్ గోల్డ్ కడా బ్యాంగిల్

బంగారు కడా గాజులు నిన్నటి తరం తప్పని ఆభరణం. బరువైన, చంకీ కడాలు ఇప్పుడు అందరికీ నచ్చడం లేదు. కొత్త తరం వెర్షన్ సొగసైనది, తేలికగా ఉండేది కోరుకుంటుంది. ఆధునిక టచ్‌తో కూడిన సాధారణ, లైట్‌వెయిట్ బంగారు కడాలను ఎంపిక చేసుకోవచ్చు. అల్లికలు, చివరలు ఓపెన్‌గా ఉండేవి, ఒకటి లేదా రెండు రేఖాగణిత నమూనాలు ఉన్నవి.. రోజువారీ దుస్తులకు సరైనవి. పూజల నుండి సంప్రదాయ శైలి వరకు కొన్ని సన్నని గాజులు, బోల్డ్ సింగల్ కడా ధరిస్తే రెండు విధాలుగా ఆకట్టుకుంటుంది. రిచ్ లుక్ కోసం ఒక మందపాటి కడాను రెండు సున్నితమైన బంగారు గాజులతో జత చేయవచ్చు. ఫ్యామిలీ ఈవెంట్స్, కార్యాలయ పూజలు, రోజువారీ సల్వార్ సూట్‌కు కూడా ఇవి బాగుంటాయి.



పోల్కీ గాజులు - భారతీయ వివాహానికి తప్పనిసరి

బాలీవుడ్ వధువుల ఎంపికతో పోల్కీ బ్యాంగిల్స్ తిరిగి వచ్చాయి. గతంలో కంటే మరింత పెద్ద స్థాయిలో రూపుదిద్దుకుంటున్నాయి. అన్‌కట్ డైమండ్స్‌తో హెరిటేజ్ ఆకర్షణతో కూడిన ఈ గాజులు రాచకళను సృష్టిస్తున్నాయి. వివాహ వేడుకలకు ఇవి ప్రత్యేకం అని చెప్పవచ్చు. వేడుకలో ఎంచుకున్న డ్రెస్‌కు తగిన కలర్, డిజైన్‌ను బట్టి గాజుల తయారీ ఉంటుంది. ఇవి ఎప్పటికీ ఎవర్‌గ్రీన్ సెట్స్ అని చెప్పవచ్చు. వారసత్వ సంపదకు అర్థమైనవి, ఏదైనా పండుగ దుస్తులకు తక్షణ గ్లామ్‌ను జోడిస్తాయి. పోల్కీ గాజులను మెరిసేలా అలంకరించాలి. దీనికి కాంబినేషన్‌గా పోల్కీ చోకర్, చెవిపోగులతో జత చేయచ్చు. వివాహాలు, కర్వా చౌత్, యానివర్సరీ పార్టీలు, రాణిలా భావించాలనుకునే ఏదైనా కార్యక్రమంలో ఈ పోల్కీ గాజులను ధరించవచ్చు.

మీనాకారీ గాజులు - రంగుల ఆనందం

రంగుల రంగులతో ఉండే గాజులను ఎవ్వరైనా ఇష్టపడతారు. మీనాకారీ గాజుల ప్రకాశవంతమైన ఎనామిల్ వర్క్, అద్భుతమైన డిజైన్లకు పేరొందాయి. పూల నుండి నెమళ్ల వరకు ఇవి సంస్కృతి, రంగుల పరిపూర్ణ మిశ్రమం. దుస్తుల రంగులకు తగినవి ఎంపిక చేసుకోవాలంటే మీనాకారీ గాజులు సరైన ఎంపిక. పండుగలు, వేడుకలలో అలంకరణ బోరింగ్‌గా ఉండకుండా ఇవి సంప్రదాయ శక్తిని తెస్తాయి. లెహంగా లేదా చీర బార్డర్ కి సరిపోయే రంగు గాజులను ఎంచుకోవచ్చు. బోనాలు, నవరాత్రి, దీపావళి, తీజ్, హల్దీ ఫంక్షన్ల సమయాల్లో ధరించే దుస్తులకు ఈ గాజులు అదనపు ఆకర్షణను తెస్తాయి. వీటిలో వేడుకను బట్టి, ఫొటో బ్యాంగిల్స్ జత చేయడం మరో ఆకర్షణ.





స్టేట్‌మెంట్ కఫ్ బ్యాంగిల్స్ - ఆధునిక శైలి

ప్రతి గాజూ సంప్రదాయకంగా ఉండనవసరం లేదు. మీదైన స్టైల్ స్టేట్‌మెంట్ చూపించాలనుకున్నప్పుడు కఫ్ బ్యాంగిల్స్ సరైనవి. వీటిలో ముత్యాలు, స్టోన్స్, ఎనామెల్ లేదా వెడల్పుగా మెటల్ కఫ్‌లను ఎంచుకోవచ్చు. ఇండో-వెస్ట్రన్ శైలికి ఇవి మీకు అనుకూలంగా ఉంటాయి. స్పెషల్‌గా, సాధారణ దుస్తులను కూడా ఫ్యాషన్-ఫార్వర్డ్‌గా కనిపించేలా ఈ కఫ్ బ్యాంగిల్స్ చేస్తాయి. మణికట్టు మీద చంకీ కఫ్ ధరించి, మరొకటి సాధారణమైనది వేసుకోవాలి. ఇది స్టైల్‌ను బ్యాలెన్స్ చేస్తుంది. స్టేట్‌మెంట్ పీస్‌గా మిమ్మల్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది. కాక్‌టెయిల్ పార్టీలు, ఫ్యూజన్ దుస్తులు లేదా మీరు మీ స్టైల్ గేమ్‌ను ప్రదర్శించాలనుకునే ఆఫీస్ గ్యాదరింగ్స్ కూడా ఈ కఫ్ బ్యాంగిల్స్ సరైన ఎంపిక.

ట్రెండ్స్ మారుతాయి. కానీ గాజులు ఎప్పటికీ ఉంటాయి. వివాహ జ్ఞాపకాలలో, పండుగలలో, రోజువారీ ఆచారాలలో, వ్యక్తిగత ఫ్యాషన్ స్టేట్‌మెంట్‌లో కూడా భాగంగా నిలుస్తాయి. చక్కగా అలంకరించిన గాజుల చేతులు అద్భుతంగా కనిపించడమే కాదు, అవి మీదైన ప్రత్యేకతను ఎదుటివారికి పరిచయం చేస్తాయి. ఇక ఇప్పుడు మీరు గాజులు ధరించడానికి వివాహిత మహిళ మాత్రమే కాదు, నేటి అభివృద్ధిలో వెలిగే ఒక స్టైల్ ఐకాన్ కూడా!

న్యూస్‌మేకర్

సాహిత్యమే పిల్లలకు మంచి చెప్పాలి

- సాహిత్య అకాడెమీ బాల సాహిత్య పురస్కార విజేత గంగిశెట్టి శివకుమార్



'మేము చదువుకునే సమయంలో రోజూ మోరల్ ఇన్‌స్ట్రక్షన్ (ఎం.ఐ.) అనే క్లాస్ ఉండేది. పిల్లల్ని కూచోబెట్టి సార్లు ఒక కథ వినిపించి అందులోని నీతి వివరించేవారు. అసలు నేడు పిల్లలకు ఇంటా బయటా మౌలిక భావాలు ఎవరు చెబుతున్నారు? పెద్దవాళ్లకా టైమ్ లేదు. మరి పిల్లలకు పరోపకారం చేయాలని, దేశభక్తి కలిగి ఉండాలని, మూఢ భావాలు ఉండకూడదని, అందరి పట్లా సమ భావన కలిగి ఉండాలని, ఆధునిక భావాలు కలిగి ఉండాలని... ఎవరు చెప్పాలి? బాల సాహిత్యమే చెప్పాలి. పిల్లల చేత పుస్తకాలు చదివిస్తే తప్ప ఇవాళ వారిలో కనిపిస్తున్న దుర్లక్షణాలు పోవు' అన్నారు గంగిశెట్టి శివ. 71 ఏళ్ల శివకుమార్ దాదాపు యాభై ఏళ్లకు పైగానే బాల సాహిత్యం రాస్తున్నారు. 2025 సంవత్సరానికి గాను ఆయన పుస్తకం 'కబుర్ల దేవత'కు బాల సాహిత్యం కేటగిరిలో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం వరించింది. ఈ సందర్భంగా 'సాక్షి ఫీచర్స్ ప్రతినిధి'తో శివకుమార్ సంభాషణ...

● బాల సాహిత్యంలోకి ఎలా వచ్చారు?

శివకుమార్: మాది నెల్లూరు జిల్లా రాపూరు. మా నాన్న పోస్టాఫీసులో పని చేసేవారు. తరుచూ బాలమిత్ర, చందమామ ఇంటికి తీసుకొచ్చేవారు. ఆ రోజుల్లో వాటిని చేత్తో తాకడమే పెద్ద సంబరం. 13 ఏళ్ల వయసులో అవి చదివి అలా నేను కూడా కథలు రాయాలనుకునేవాణ్ణి. 14వ ఏట మొదటి కథ పోస్ట్ చేశాను. అప్పటి నుంచి పిల్లల కథలు రాసి పత్రికలకు పంపించడం మొదలుపెట్టాను.

● కథల్లో పిల్లలకు ఏం చెబుతుంటారు?

జ: నేను కొడవటిగంటి కుటుంబరావు గారి ఏకలవ్య శిష్యుణ్ణి. ఆయనలాగే పిల్లల్లో ఆలోచన, విచక్షణ పెరిగే సాహిత్యం ఉండాలని కోరుకుంటాను. మంత్రాలు, తంత్రాలు కాకుండా హేతువుకు ప్రాధాన్యం పెరిగేలా రాశాను. బాలసాహిత్యం చదివిన పిల్లలు తమకు తాము మేలు చేసుకోవాలి, సమాజానికి మేలు చేయాలి. ఇవి చేయడానికి వీలు కల్పించని సాహిత్యం మంచి బాల సాహిత్యం కాదు. ఇవాళ్టి పిల్లలు రేపటి పౌరులు మాత్రమే కాదు మహా పురుషులు కావాలి. కాని ఏ మహాపురుషుడి గురించి వీరు తెలుసుకుంటున్నారు... చదువుతున్నారు? మనందరం గాంధీ, నెహ్రూ గాథల నుంచి కదా ఇన్‌స్పైర్ అయ్యింది?

● ఇప్పటి వరకూ ఎన్ని పుస్తకాలు రాశారు?

జ: పది పుస్తకాలు రాశాను. కథలు వందల కొద్దీ రాశాను. నేను బి.ఎస్సీ చదివి తెలుగు ఎం.ఏలోకి వచ్చాను భాష మీద ప్రేమతో. ఇవాళ ఎంతమంది అలా వస్తున్నారు? భాష, సాహిత్యాలకు బడులలో ప్రాధాన్యం లేదు. మార్కులు, ర్యాంకులు ప్రధానమయ్యాయి తల్లిదండ్రులకు. వ్యక్తిత్వం మార్కులతో, ర్యాంకులతో రాగలదా? వ్యక్తిత్వ నిర్మాణమే దేశ నిర్మాణం అని తెలుసుకోవాలి. ఇవాళ టీచర్ల మీద దాడి చేస్తున్న పిల్లలు, తల్లిదండ్రులను ఆదరించని పిల్లలు ఏ సంస్కృతికి ప్రతిఫలం? ఇలాంటి పిల్లలు గొప్ప సాహిత్యం, నైతిక విలువలు పాదుకొలిపే పుస్తకం ఒక్కటి కూడా చదివి ఉండరు. వీరి చేత చదివించని పెద్దలు వీరి నుంచి మంచి నడవడికను మాత్రం ఆశిస్తారు. అదే విచిత్రం.

● 'కబుర్ల దేవత' పుస్తకానికి మీకు పురస్కారం వచ్చింది. 'కబుర్ల దేవత' కథ పేరు. అందులో ఏముంది?

జ: కొంతమంది మాటలు చెప్పి బతగ్గలరు. అదొక స్కిల్. అది అందరికీ రావాలని లేదు. అంతమాత్రాన పనిమంతుడికి విలువ తగ్గదు. పని తెలిసినవాడు తన పని తాను చేసుకెళ్లాలి. దానికీ ఫలితం ఉంటుంది. మాట్లాడేవాళ్లను చూసి బెదరిపోవద్దు అనే వ్యక్తిత్వ వికాస కోణంలో ఆ కథ పిల్లలకు చెప్పాను.

● మీకు నచ్చిన బాల సాహిత్యకారులు?

జ: కలువకొలను సదానంద గారు మంచి సాహిత్యం రాశారు. పిల్లలకు సులభంగా అర్థమయ్యే శైలి వారిది. కె.సభా కూడా మంచి బాల సాహిత్యం రాశారు.

● మీ ఇతర వివరాలు

జ: నేను నెల్లూరు జిల్లాలోనే వివిధ చోట్ల ఉపాధ్యాయునిగా పని చేసి రిటైర్ అయ్యాను. మ అబ్బాయి చెన్నైలో, అమ్మాయి నెల్లూరులో స్థిరపడ్డారు. రిటైరయ్యాక కూడా ఒక స్కూల్ బాధ్యతలు చూస్తున్నాను. పిల్లలను కంట్రోల్ చేయడం ఎంత కష్టంగా ఉందో చెప్పలేను. పిల్లలు ఇలా ఎందుకు ఉన్నారో అందరూ కలిసి ఆలోచించాలి. పిల్లల బాధ్యత సమాజం బాధ్యత అనుకోనంత వరకూ బాలల వికాసం పరిపూర్ణంగా జరగదు.

బులియన్ (బంగారం 10 గ్రా. : వెండి కిలో) జూన్ 19న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,710
బంగారం (22 క్యారెట్లు)	91,290
వెండి	1,08,300
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,02,300
బంగారం (22 క్యారెట్లు)	92,650
వెండి	1,11,300
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	1,01,800
బంగారం (22 క్యారెట్లు)	92,650
వెండి	1,22,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,02,300
బంగారం (22 క్యారెట్లు)	95,430
వెండి	1,08,700
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,000
బంగారం (22 క్యారెట్లు)	90,160
వెండి	1,07,500
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	1,01,070
బంగారం (22 క్యారెట్లు)	92,650
వెండి	1,22,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.


సాక్షి సినిమా



● కీర్తి సురేష్, సుహాస్

ఐడియా ఉందా?

కీర్తి సురేష్, సుహాస్ ముఖ్య తారలుగా, బాబు మోహన్, శత్రు, తాళ్ళూరి రామేశ్వరి ఇతర కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఉప్పు కప్పురంబు'. వసంత్ మరింగంటి రాసిన కథతో, ఐవీ శశి దర్శకత్వంలో రాధిక లావూ నిర్మించిన ఈ చిత్రం అమెజాన్ ప్రైమ్ వీడియోలో జూలై 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా గురువారం 'ఉప్పు కప్పురంబు' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ''నిన్న మన స్మశానంలో తిరుగుతుంటే నాకో విషయం తెలిసిందండీ... ఇక నాలుగు స్థలాలే ఖాళీగా ఉన్నాయి. అంటే మన ఊర్లో నాలుగు శవాలు పూడ్చిపెట్టడానికి మాత్రమే చోటుంది. అదీ విషయం', 'నాకైతే ఏమీ తెలియదు... మీ దగ్గర ఏమైనా ఐడియా ఉందా?, సమాధి చోటు కోసం ఎవరైనా కొట్టుకుంటారా? అందరూ వచ్చి నాక్కావాలి నాక్కావాలి అంటే..' అన్న డైలాగ్స్ ఈ ట్రైలర్‌లో ఉన్నాయి. 1990లో చిట్టిజయపురం అనే కల్పిత గ్రామంలో ఈ సినిమా కథనం సాగుతుందని విడుదలైన ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ సందర్భంగా కీర్తి సురేష్ మాట్లాడుతూ- ''ఉప్పు కప్పురంబు'లో ఆదర్శవాది, దృఢనిశ్చయం గల అపూర్వ అనే అమ్మాయి పాత్రలో నటించాను. గ్రామీణ సంస్కృతుల నేపథ్యంలో ఈ సినిమా ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది'' అని తెలిపారు. ''ఈ సినిమాలో చిన్నా అనే పాత్రలో కనిపిస్తాను. చిన్నా ఒక విచిత్రమైన పరిస్థితుల్లో చిక్కుకుంటాడు. అదేంటో సినిమాలో చూడండి. ఈ సినిమాలో మంచి భావోద్వేగాలు ఉన్నాయి'' అని అన్నారు సుహాస్.



● దివ్యేందు

రామ్ బుజ్జి బౌలింగ్ వేస్తే..!

ఇక్కడున్న ఫొటో చూశారుగా..! రామ్ బుజ్జి బాల్ ఎగరేసి, ఎంత కాన్ఫిడెంట్‌గా కనిపిస్తున్నాడో! మరి... రామ్ బుజ్జి బౌలింగ్ వేస్తే ఎలా ఉంటుంది? అతని బౌలింగ్‌లో పెద్ది బ్యాటింగ్ చేస్తే ఏం జరుగుతుంది? అనే సీన్స్‌ను థియేటర్స్‌లో చూడాల్సిందే. రామ్‌చరణ్ టైటిల్ రోల్ చేస్తున్న మల్టీస్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కాగా గురువారం దివ్యేందు శర్మ జన్మదినం సందర్భంగా 'పెద్ది'లో రామ్ బుజ్జి పాత్రలో తను నటిస్తున్నట్లుగా వెల్లడించి, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. 'మిర్జాపూర్, ది రైల్వేమెన్' వంటి వెబ్ సిరీస్‌లతో పాటు హిందీలో 'టాయ్‌లెట్: ఏక్ ప్రేమ్ కథ, 2016 ది ఎండ్' వంటి సినిమాల్లో నటించిన దివ్యేందుకు 'పెద్ది' తొలి స్ట్రయిట్ తెలుగు ఫిల్మ్. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది మార్చి 27న రిలీజ్ కానుంది.



ప్రేక్షకులు ఆదరించేదే పెద్ద సినిమా - అక్కినేని నాగార్జున

''కుబేర' సినిమాలో నాది బిలియనీర్ పాత్ర అని అందరూ అనుకుంటున్నారు. కానీ, నాది మధ్య తరగతి వ్యక్తి ప్రాత. సీబీఐ ఆఫీసర్‌గా కనిపిస్తాను. మంచి చేయాలా? చెడు చేయాలా? అనే సంఘర్షణ మధ్య నా పాత్ర ఉంటుంది. నా క్యారెక్టర్‌ని శేఖర్ కమ్ముల చాలా అద్భుతంగా రాశారు. నా పాత్రలో చాలా ఛాయలుంటాయి.. అదే విధంగా సెటిల్డ్ పెర్ఫార్మెన్స్‌కి మంచి చాన్స్ దక్కింది'' అని అక్కినేని నాగార్జున తెలిపారు. అక్కినేని నాగార్జున, ధనుష్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా, బాలీవుడ్ నటుడు జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీఎల్ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున పంచుకున్న విశేషాలు.

● 'కుబేర' లాంటి మంచి కథలు రావాలంటే స్టార్ హీరోలు కలిసి పని చేయాలి. ఇంతకుముందు కూడా నేను చాలా సినిమాలు కలిసి చేశాను. గతంలో నాన్నగారు(ఏఎన్ఆర్), ఎన్టీఆర్, కృష్ణ, శోభన్‌బాబు గార్లు... ఇలా చాలా మంది కలిసి మల్టీస్టారర్ సినిమాలు ఎన్నో చేశారు. పైగా శేఖర్ కమ్ముల గారితో పని చేయాలని ఎప్పటి నుంచో ఉండేది. 'ఆనంద్' సినిమా నుంచి ఆయన ఏంటో, ఆయన సినిమాలు ఎలా ఉంటాయో మనందరికీ తెలుసు. ఆయన కథల్లో సామాజిక సంబంధిత అంశాలు ఉంటాయి. అందుకే శేఖర్‌గారి సినిమాలు నాకు బాగా ఇష్టం. తన సినిమాల్లో సామాజిక అంశాలతో పాటు ఇతర వాణిజ్య అంశాలు కూడా ఉంటాయి.

● 'కుబేర'లో మంచి యునిక్ పాయింట్ ఉంది. ప్రస్తుత సమాజానికి ఆ పాయింట్ చాలా దగ్గరగా ఉంటుంది. అలాగే అద్భుతమైన సంఘటనలు ఉంటాయి. అవన్నీ కూడా నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటాయి. ఈ సినిమాలో మంచోళ్లు ఉన్నారు, చెడ్డోళ్లు ఉన్నారు. బిలియనీర్, మధ్యతరగతి, బిలో పావర్టీ లైన్... ఇలా మూడు సొసైటీల మధ్య క్లాష్ ఈ సినిమాలో ఉంటుంది. వైవిధ్యమైన ఈ కథలో రెగ్యులర్ స్క్రీన్ ప్లే ఉండదు... రొటీన్ క్యారెక్టర్స్ కనిపించవు. ఇందులో ఏ పాత్ర కూడా హీరో, హీరోయిన్ అనడానికి లేదు. తెరపై మేము కాకుండా ప్రేక్షకులకు అన్నీ పాత్రలే కనిపిస్తాయి. ఇలాంటి సినిమాలు చేయడానికి ధైర్యం కావాలి.

● ఈ సినిమాలో నా ఇమేజ్‌కి తగ్గట్టు స్క్రిప్ట్‌లో శేఖర్‌గారు ఎలాంటి మార్పులు చేయలేదు. ఆయన ఏమనుకున్నారో అదే చేశారు. నేను కూడా ఎలాంటి మార్పులు అడగలేదు.. మార్చితే కథ మారిపోతుంది. మా ఫ్యామిలీలో దాదాపుగా అందరూ శేఖర్‌గారితో పని చేశారు. 'కుబేర'లో చేయడానికి ఆయన వర్కింగ్ స్టైల్ గురించి నాగ చైతన్యని అడిగాను. ఎందుకంటే రీసెంట్‌గా తను 'లవ్ స్టోరీ' మూవీ చేశాడు కాబట్టి. 'శేఖర్‌గారి వర్కింగ్ స్టైల్ చాలా బాగుంటుంది. మీరు చాలా ఎంజాయ్ చేస్తారు' అని చెప్పాడు. 'కుబేర'లో నా బాడీ లాంగ్వేజ్, మాట తీరు, రియాక్షన్స్... అన్నీ కూడా కొత్తగా శేఖర్‌గారి శైలిలో ఉంటాయి. తమిళ్ వెర్షన్‌లోనూ నేనే డబ్బింగ్ చెప్పాను.

● ధనుష్ తన పాత్రలో ఒదిగిపోయాడు.. అద్భుతంగా నటించాడు. సెట్స్‌లో మా బాండింగ్ చాలా బాగుండేది. షాట్ గ్యాప్‌లో సినిమాల గురించి మాట్లాడుకునేవాళ్లం. ఈ చిత్రంలో రష్మికా మందన్న అద్భుతంగా నటించింది. ఫైనల్ కాపీ చూశాక, ఫోన్ చేసి 'కుబేర'లో నువ్వే స్టార్' అని చెప్పాను.. తను చాలా సంతోషపడింది. సునీల్ నారంగ్, రామ్మోహన్‌గార్లు పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాని ఎక్కడా రాజీ పడకుండా చాలా ప్యాషన్‌తో నిర్మించారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం ఈ చిత్రానికి చాలా ముఖ్యం. పాటలు కూడా సందర్భానుసారంగా వస్తాయి. కెమెరామేన్ నికేత్ బొమ్మరెడ్డి అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు.

● ప్రస్తుతం చాలా మంది పాన్ ఇండియా సినిమా అంటూ నాలుగైదు భాషల్లో విడుదల చేస్తున్నట్లు పోస్టర్స్ వేసుకుంటున్నారు. నిజం చెప్పాలంటే పాన్ ఇండియా సినిమాలు చేయడం చాలా కష్టమైన పని. అన్ని సినిమాలూ దానికి సరిపోవు. స్టార్ హీరోలు, స్టార్ డైరెక్టర్, బిగ్ ప్రొడక్షన్ హౌస్ కలిసి పెద్ద సినిమా చేసినప్పటికీ కథలో విషయం లేకుంటే ఉపయోగం లేదు. ఈ మధ్య అలాంటి భారీ బడ్జెట్ సినిమాల్ని కూడా ప్రేక్షకులు తిరస్కరించారు. కానీ 'కోర్ట్' లాంటి చిన్న సినిమా సూపర్ హిట్ అయింది. నా దృష్టిలో ప్రేక్షకులు ఆదరించేదే పెద్ద సినిమా. అలాగే మంచి కథ ఉన్నదే పెద్ద సినిమా.

● నా కెరీర్‌లో వందో సినిమాని తమిళ దర్శకుడు కార్తీక్‌తో చేస్తున్నాను. 'కింగ్ 100' అని వర్కింగ్ టైటిల్ పెట్టాం. ఈ చిత్రాన్ని మా అన్నపూర్ణ స్టూడియోస్‌పై నిర్మిస్తాం. అయితే వందో సినిమా వంద కోట్ల బడ్జెట్‌తో రూపొందనుందనే వార్తల్లో నిజం లేదు. అఖిల్ హీరోగా నటిస్తున్న 'లెనిన్' చిత్రంలో నేను నటించడం లేదు. నేను, నాగచైతన్య, అఖిల్ కలిసి పూర్తి స్థాయిలో ఓ సినిమా చేయాలని మా అభిమానులు కోరుకుంటున్నారు. అయితే ఇప్పుడప్పుడే అలాంటి సినిమా వచ్చే పరిస్థితి లేదు. ఎందుకంటే మా ముగ్గురికి సరిపడే కథతో ఇప్పటివరకూ ఎవరూ నన్ను కలవలేదు.

● నటుడిగా దాదాపు నలభై ఏళ్ల కెరీర్ నాది. ఎన్నో పాత్రలు చేశాను. అయితే ఫలానా పాత్ర చేయాలనే కల నాకు లేదు. నాకు నచ్చిన, వైవిధ్యమైన పాత్రలు చేసుకుంటూ వెళుతుంటాను. రజనీకాంత్‌గారి 'కూలీ' సినిమాలో ప్రాపర్ విలన్‌గా కనిపిస్తాను. లోకేశ్ కనగరాజ్ చక్కగా తీశారు. అయితే 'కూలీ'లోలా మళ్లీ విలన్ పాత్ర చేయను. క్యారెక్టర్ నచ్చితే కామెడీ కూడా చేస్తాను. ఏం చేసినా నాకు కొత్తగా అనిపించాలి. నేను నటించిన 'శివ' సినిమాని రీ రిలీజ్ చేయబోతున్నాం. 4కే పనులు పూర్తయ్యాయి. ఇంకా బెటర్ ఎఫెక్ట్స్ కోసం వర్క్ జరుగుతోంది. ఒక రీల్ చూశాను.. క్వాలిటీ అద్భుతంగా ఉంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్లలో సినిమాకి చర్చలు జరిగాయి. అదే విధంగా 'బ్రహ్మాస్త్ర 2' లోనూ నా పాత్ర ఉంటుందని డైరెక్టర్ అయాన్ ముఖర్జీ చెప్పారు.


మధ్యతరగతి సోలోబాయ్



● జ్యోతీ బాయ్, శ్రీరామ్ నాయక్, గౌతమ్ కృష్ణ

గౌతమ్ కృష్ణ, రమ్య పసుపులేటి, శ్వేత అవస్థి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'సోలో బాయ్'. నవీన్ కుమార్ దర్శకత్వంలో వేణుదారి బేబీ నేహశ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మించిన ఈ చిత్రం జూలై 4న విడుదల కానుంది. భారతదేశం ఇటీవల నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్'లో అమరుడైన తెలుగు జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేయించారు. ఈ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ – ''మధ్య తరగతి కుటుంబాలను ఆధారంగా చేసుకుని తీసిన చిత్రం ఇది. నన్ను ఇక్కడి వరకు తీసుకువచ్చింది ప్రేక్షకులే. అందుకే నా వంతుగా ఏదో ఒకటి చేయాలని సమవర్తి అనే ట్రస్టు ద్వారా నాకు వచ్చే ప్రతి సంపాదనలోనూ సగం ఈ ట్రస్టుకు అందజేయాలని నిర్ణయించుకున్నాను. 'బిగ్‌బాస్' షోతో వచ్చిన డబ్బులో సగం ఆ ట్రస్టు ద్వారా ముందుగా ఒక లక్ష రూపాయలు మురళీ నాయక్‌గారి కుటుంబానికి అందజేస్తున్నాను'' అన్నారు. ''ఈ చిత్రం హీరో గౌతమ్ రెమ్యునరేషన్ తీసుకోకపోవడంతో పాటు కొంత డబ్బు పెట్టి, ఈ సినిమాను ముందుకు తీసుకువెళ్లాడు'' అన్నారు నిర్మాత సతీష్. ''మా 'సోలో బాయ్' మధ్యతరగతి కుటుంబాలను ప్రతిబింబించే చిత్రం'' అన్నారు దర్శకుడు నవీన్. ''దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ కుటుంబం కోసం త్వరలో మ్యూజికల్ నైట్ నిర్వహించి, వచ్చే ఆదాయాన్ని వారి కుటుంబానికి అందజేయాలనుకుంటున్నాను'' అన్నారు మ్యూజిక్ డైరెక్టర్ ఆర్పీ పట్నాయక్. ''మా కొడుకు దేశం కోసం ప్రాణాలర్పించడం మాకెంతో గౌరవంగా ఉంది. గౌతమ్ మాట్లాడుతుంటే మా అబ్బాయి మాట్లాడుతున్నట్లే ఉంది'' అన్నారు మురళీ నాయక్ తల్లిదండ్రులు.

పది కోట్ల పాటలో...



● విరాట్ కర్ణ

'పెదకాపు' చిత్రం ఫేమ్ విరాట్ కర్ణ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'నాగబంధం'. 'ది సీక్రెట్ ట్రెజర్' అన్నది ట్యాగ్‌లైన్. నిర్మాత అభిషేక్ నామా ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. నభా నటేశ్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పణలో ఎన్ఐకే స్టూడియోస్, అభిషేక్ పిక్చర్స్‌పై కిశోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సినిమా కోసం ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కేరళ అనంత పద్మనాభ స్వామి టెంపుల్ సెట్‌లో పాట చిత్రీకరణ జరుగుతోంది. ''ఈ పాటలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్య కళాకారులు పాల్గొంటున్నారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేశ్ ఆచార్య పర్యవేక్షణలో ఈ పాటను చిత్రీకరిస్తున్నాం. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ. 10 కోట్లు బడ్జెట్ కేటాయించాం. ఈ అద్భుతమైన సీక్వెన్స్ ఎప్పటికీ గుర్తుండిపోయేలా ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది. జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సౌందర్ రాజన్ ఎస్, సంగీతం: అభే.